మహిళలకు 'వైఎస్సార్ ఆసరా'



మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. గడిచిన నాలుగేళ్లుగా మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు వారి అభ్యున్నతికి మెట్లు వేశారు. గతంలో చంద్రబాబు పొదుపు రుణాలు భేషరతుగా మాఫీ చేస్తానని చెప్పి మోసం చేశాడు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు వరకు ఎంత పొదుపు రుణాలు ఉన్నాయో.. ఆ మొత్తాన్ని నాలుగు విడతల్లో పొదుపు అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేస్తానని హామీ ఇచ్చాడు. ఆ మాట మేరకు ఇప్పటి వరకు రెండు విడతలు జమ చేశారు. తాజాగా శనివారం మూడో విడత నిధులు విడుదల చేయనున్నారు.

- 43,670 మంది పొదుపు సభ్యులకు లబ్ధి
- గత రెండు విడతల్లో రూ.65.69 కోట్లు
- నేడు మూడో విడతగా రూ.33.12 కోట్ల నిధులు విడుదల
- ఆనందంతో పొదుపు మహిళలు

కావలి: మహిళలు ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో 'వైఎస్సార్ ఆసరా' పథకం ఒకటి. పొదుపు మహిళల్లో కొత్త కాంతులు వెలుగొందాలనే సంకల్పంతో 'వైఎస్సార్ ఆసరా' కింద ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్రలో పొదుపు మహిళలకు, 2019 ఎన్నికలు నాటికి బ్యాంకులకు అప్పు ఎంత ఉంటే అదంతా కూడా నాలుగు విడతలుగా చెల్లిస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 'వైఎస్సార్ ఆసరా' ప్రారంభించి, ఇప్పటికి రెండు విడతలుగా 'వైఎస్సార్ ఆసరా' పథకం కింద పొదుపు సంఘాల మహిళలకు ఇచ్చిన ఆర్థిక సహాయం కొనసాగింపుగా మూడో ఏడాది శనివారం దెందులూరులో విడుదల చేయనున్నారు. కావలి నియోజకవర్గంలోని కావలి పట్టణం, కావలి రూరల్, బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాల్లోని 4,367 పొదుపు సంఘాల్లోని 43,760 మంది మహిళలకు లబ్ధి చేకూరుతోంది. తొలి విడతలో రూ.32.57 కోట్లు, రెండు విడతలో రూ.33.12 కోట్లు విడుదల చేయగా, తాజాగా రూ.33.12 కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ కానున్నాయి.

- కావలి పట్టణంలో 11,450 మంది పొదుపు మహిళలకు మొదటి విడతలో రూ.8.66 కోట్లు, రెండో విడతలో 11,480 మందికి రూ.8.69 కోట్లు, తాజాగా మూడో విడతలో 11,500 మందికి రూ.8.69 కోట్లు జమకానున్నాయి. ఒక్క కావలి పట్టణంలోనే 'వైఎస్సార్ ఆసరా' కింద మూడు విడతల్లో 11,500 మంది మహిళలకు రూ.26.04 కోట్లు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసింది.
- కావలిరూరల్ మండలంలో 11,280 మంది పొదుపు మహిళలకు మొదటి విడతలో రూ.8.83 కోట్లు, రెండో విడతలో 11,280 మంది మహిళలకు రూ. 8.96 కోట్లు, తాజాగా మూడో విడతలో 11,280 మంది మహిళలకు 8.96 కోట్లు జమ కానున్నాయి. మొత్తం రూ.26.75 కోట్లు అందజేశారు.
- బోగోలు మండలంలోని 7,500 మంది పొదుపు మహిళలకు రూ.5.44 కోట్లు, రెండో విడతలో రూ.5.56 కోట్లు, తాజాగా మూడో విడతలో రూ.5.56 కోట్లు మంజూరు కానున్నది. మొత్తం రూ.16.56 కోట్లు మంజూరయ్యాయి.
- దగదర్తి మండలంలో 5,530 మంది పొదుపు మహిళలకు రూ.4.11 కోట్లు మొదటి విడతలో మంజూరయ్యాయి. రెండో విడతలో రూ.4.2 కోట్లు, తాజాగా మూడో విడతలో రూ.4.2 కోట్లు విడుదల కానున్నది. మొత్తం రూ.12.51 కోట్లు ఆర్థిక సహాయం అందించింది.
- అల్లూరు మండలంలో తొలివిడతలో 7,860 మంది పొదుపు మహిళలకు రూ.5.53 కోట్లు, రెండో విడతలో రూ.5.71 కోట్లు, తాజాగా మూడో విడతలో కూడా రూ.5.71 కోట్లు మంజూరు కానున్నది. మొత్తం 16.95 కోట్లు మంజూరైంది.

మా కుటుంబాలకు 'ఆసరా'



మా పొదుపు గ్రూపులకు పాత అప్పుల తాలూకా ఇస్తున్న ఆర్థిక సహాయం మా కుటుంబాలకు ఆర్థికంగా ఆసరాగా ఉంటుంది. అప్పట్లో మా అప్పులు మాఫీ చేస్తానని చెప్పి నాయకులు చేయలేదు. జగన్ అధికారంలోకి రాగనే మా అప్పులు తీరుస్తున్నారు. జగన్ చెబితే చేస్తాడనే నమ్మకం మాకు ఉంది.
– జి.మరియమ్మ, పొదుపు మహిళ, తాళ్లపాళెం, కావలి మండలం

మాట నిలబెట్టుకుంటున్న సీఎం



పాదయాత్ర చేసేటప్పుడే పొదుపు రుణాలు ఎన్నికల సమయానికి ఎంత ఉంటే అంత నాలుగు దఫాలుగా ఇస్తానని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. ఆ మాట నిలబెట్టుకున్నారు. ఇప్పటికి రెండు సార్లు వైఎస్సార్ ఆసరా పేరుతో ఇచ్చారు. ఇప్పుడు మూడో సారి ఇవ్వడానికి వివరాలన్నీ అధికారులు తీసుకున్నారు.
– ఏ మమత, పొదుపు మహిళ, గౌరవరం, కావలి రూరల్ మండలం

పొదుపు మహిళల్లో ఉత్సాహం



పొదుపు మహిళా సంఘాల్లో ఉన్న వారికి వైఎస్సార్ ఆసరా వల్ల ఉత్సాహం వచ్చింది. పొదుపు మహిళల గురించి ఎవరూ పట్టించుకోరనే అభిప్రాయం ఉండేది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అలాంటి నిరాశను పోగొట్టే విధంగా ఆసరా పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నారు.
– పి.సుశీలమ్మ, పొదుపు మహిళ, గౌరవరం, కావలి రూరల్ మండలం

క్లుప్తంగా

ఉత్తమ సేవలకు ప్రశంసలు



ప్రశంసా పత్రం అందుకుంటున్న డాక్టర్ వరలక్ష్మి

సోమశిల: అనంతసాగరం పీహెచ్‌సీ వైద్యాధికారి వరలక్ష్మికి వరల్డ్ టీబీ డే సందర్భంగా శుక్రవారం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి పెంచలయ్య ఉత్తమ ప్రశంసాపత్రం అందజేశారు. పీహెచ్‌సీ పరిధిలో క్షేత్రస్థాయిలో ఆరోగ్య సేవలు మారుమూల ప్రాంతాల్లో ఆరోగ్యంపై అందరికీ అవగాహన కల్పించడంలో డాక్టర్ వరలక్ష్మి చేసిన కృషికి ఈ గౌరవం దక్కింది.

వైద్య సిబ్బందికి అవార్డులు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ రాకేష్

ఆత్మకూరురూరల్: క్షయవ్యాధి నిర్మూలనలో ఉత్తమ సేవలు అందించిన ఆత్మకూరు వైద్యాధికారి డాక్టర్ ఆర్.రాకేష్‌తో పాటు మహిమలూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి శుక్రవారం డీఎంహెచ్‌ఓ ఎం.పెంచలయ్య అవార్డులు అందజేశారు. డాక్టర్ రాకేష్‌తో పాటు నువ్వూరుపాడు ఏఎన్‌ఎం పద్మ, వాశిలి ఎంఎల్‌హెచ్‌పీ సుగుణ తదితరులు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం

మర్రిపాడు: మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉత్తమ సేవలు అందించిన సూపర్‌వైజర్ ఖాజామొహిద్దీన్, ఫార్మసిస్ట్ అరుల్‌కు ఉత్తమ సేవా పురస్కారాలను డీఎంహెచ్‌ఓ పెంచలయ్య అందజేశారు. జిల్లా స్థాయి అవార్డు రావడంపై పీహెచ్‌సీ సిబ్బంది వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ వెంకటప్రసాద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవకు ప్రశంస

ఉదయగిరి: ఉదయగిరి టీబీ యూనిట్ ఆర్గనైజర్ బొగ్యం వెంకటేశ్వర్లు విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినందుకు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందారు. శుక్రవారం ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా నెల్లూరులో డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, జిల్లా క్షయ నియంత్రణాధికారి జి.వెంకటప్రసాద్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు వైద్య ఆరోగ్య సిబ్బంది అభినందించారు.

పూర్వ విద్యార్థులకు ఆర్థిక సహాయం

కలిగిరి: కలిగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2021–22 విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శ్రీజగన్మాత వెంగమాంబ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మండవ వెంకటేశ్వర్లు శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. 10వ తరగతి ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.12 వేలు నగదును అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం భీమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచినీటి పథకానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ పద్మావతి

సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లి పంచాయతీ ఏసీనగర్‌లో కేంద్ర జలశక్తి పథకం కింద మంచినీటి పథకానికి ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, సర్పంచ్ పల్లె విజయమ్మ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ త్వరితగతిన మంచినీటి పథకాన్ని పూర్తిచేసి గ్రామస్తులకు నీరందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాలినేని ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

బయోమెట్రిక్ తప్పనిసరి

సీతారామపురం: సచివాలయ సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ అన్నారు. ఆయన శుక్రవారం అయ్యవారిపల్లిలో సచివాలయం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది 3 నుంచి 5 గంటల వరకు అందుబాటులోఉండి గ్రీవెన్స్ నిర్వహించాలన్నారు.

పలువురికి ఆర్థిక సాయం



జలదంకి: మండలంలోని సోమవరప్పాడులో ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న పలువురికి కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ శుక్రవారం రాత్రి ఆర్థికసాయం అందించారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న గ్రామానికి చెందిన ఆర్.తులసమ్మ, వెంకాయమ్మకు ఒక్కొక్కరికి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. గ్రామంలో వృద్ధురాలు కాంతమ్మకు రూ.20 వేల అందించారు. ప్రభాకర్, చంద్రకాంత్, పీవీ రమణయ్య పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల పారువేట



ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులోని సీతారామ, లక్ష్మణ, హనుమంత సమేత కోదండ రామస్వామి దేవాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాలు శుక్రవారం పారువేట మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించడంతో ఘనంగా ముగిశాయి. స్వామి, అమ్మవార్ల కల్యాణ అనంతరం తెల్లవారుజాము నుంచి గ్రామోత్సవంలో మహిళా భక్తులు అధికంగా పాల్గొని మంగళ హారతులు పట్టారు. అనంతరం జరిగిన పారువేటలో మంగళ వాయిద్యాలు, మేళతాళాలు, డీజే, బాణసంచా వేడుకలతో నిర్వహించిన కార్యక్రమంతో యువకులు కేరింతలు కొడుతూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజలు డ్రైడే నిర్వహించాలి

దుత్తలూరు: ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని మలేరియా ఉదయగిరి సబ్‌యూనిట్ ఆఫీసరు నౌషాద్ తెలిపారు. శుక్రవారం దుత్తలూరు పీహెచ్‌సీ పరిధిలోని బీసీ కాలనీలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమ పుట్టకూడదు, దోమ బ్రతకకూడదు అనే నినాదంతో ప్రతి ఇంటికీ వెళ్లి నిల్వ ఉన్న నీటిని ఖాళీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజరు జగన్‌మోహన్, ఏఎన్‌ఎం మాధవి, హెల్త్ అసిస్టెంట్ నారాయణ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహకాలు



కరటంపాడు పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు, ఉపాధ్యాయులు



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న తహసీల్దార్, ఎస్సై, తదితరులు

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు, మురగళ్ల ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు శుక్రవారం మాజీ సర్పంచ్ గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు సమకూర్చిన పెన్నులు, ప్యాడ్‌లు, పెన్సిళ్లు, హాల్ టికెట్లను విద్యార్థులకు అందజేశారు. మురగళ్ల ఉన్నత పాఠశాలలో జరిగిన సరస్వతీ పూజలో విగ్రహదాత మద్దినేని ప్రసాద్‌నాయుడు దంపతులు ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు పౌచ్‌లు, పెన్నులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాల హెచ్‌ఎంలు రఘురామయ్య, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ప్రతిభ, శ్రీలత, సర్పంచ్‌లు పూనుగుంట రేవతి, పువ్వాడి హరిత, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్య

కొండాపురం: ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు మంచి విద్య బోధన అందుతుందని కొండాపురం తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్య, ఎస్సై షేక్ ఖాజావలి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న 35 మంది విద్యార్థులకు మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్, జామెన్ ట్రీ బాక్సు, పెన్నులను అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, మిత్ర ఫౌండేషన్ సభ్యులు వి.సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీదేవికి పూజ

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో సరస్వతీదేవికి విద్యార్థులు ఘనంగా పూజలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హమీద్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో ప్రతి ఒక్కరూ నూటికి నూరు మార్కులు సాధించేలా ప్రయత్నం చేయాలన్నారు. సరస్వతీదేవి కటాక్షం ప్రతి విద్యార్థిపై మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పది విద్యార్థుల సరస్వతీ పూజ

వరికుంటపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు శుక్రవారం సరస్వతీదేవి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉత్తమ ఫలితాలు సాధించాలని వేడుకున్నారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి పది విద్యార్థులకు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ

దుత్తలూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులు సరస్వతీ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు అమ్మవారి విగ్రహాన్ని అలంకరించి పూజలు నిర్వహించారు. జేఎస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు, పౌచ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో సరస్వతీ పూజ

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో విద్యార్థులు సరస్వతీపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల ఆవరణలోని సరస్వతీ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించాలని వేడుకున్నారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ

మర్రిపాడు: మండలంలోని చుంచులూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెనులను దాతలు పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుల తల్లి సరస్వతీదేవి పూజలు నిర్వహించారు. పరీక్షల్లో విద్యార్థులు సరస్వతీదేవి అనుగ్రహంతో మంచి ఫలితాలు సాధించాలని హెచ్‌ఎం రమేష్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దువ్వూరు రామ్మోహన్ జ్ఞాపకార్థం ఆయన సతీమణి భవాని, కుమారుడు సురేష్, మల్లికార్జున పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ జొన్నా సత్యనారాయణ, విశ్రాంత హెచ్‌ఎం కలిశెట్టి వెంకటరమణయ్య, ఉపాధ్యాయులు రాజేంద్రకుమార్, రమణయ్య, అశోక్, రేవతి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ పరీక్ష సామగ్రి పంపిణీ

ఆత్మకూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆత్మకూరు శాఖ విద్యార్థినులకు పెన్నులు, ప్యాడ్‌లు, పెన్సిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు బడుగు శ్రీనివాసులు, జనార్దన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ నిర్వాహకులు ఎం.శ్రీనివాసులు, ఓ శ్రీనివాసులు, డి శ్రీనివాసులు, లక్ష్మణమూర్తి, కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంతో ప్రజారోగ్యం



శిక్షణా తరగతుల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులతో ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి

ఆత్మకూరురూరల్: పారిశుధ్య కార్యక్రమాలతో ప్రజారోగ్యం ఉంటుందని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కరటంపాడు ఎల్‌టీసీ కేంద్రం వద్ద శుక్రవారం ఆత్మకూరు, చేజర్ల మండలాలకు చెందిన సచివాలయ అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఎంపీపీ మాట్లాడుతూ చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై శిక్షణ పొందిన అందరూ ఆయా అంశాలపై లోతుగా అధ్యయనం చేయాలని కోరారు. చెత్త సంపద తయారీ కేంద్రాల ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేసి విక్రయించి గ్రామ పంచాయతీలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. ఆత్మకూరు, చేజర్ల మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులతో పారిశుధ్య కార్యక్రమాల అమలుపై వేర్వేరుగా మాట్లాడి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆత్మకూరు, చేజర్ల విస్తరణాధికారులు ఉషారాణి, రామయ్య, జిల్లా రిసోర్స్‌పర్సన్ ప్రసాద్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ పూనుగుంట రేవతి, పంచాయతీ కార్యదర్శులు రేవూరు అంకయ్య, ఎల్‌వీ ప్రసాద్, వీఆర్‌ఓ ఆనందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పఠాన్ రఫీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కావలిరూరల్: తమ్ముడి మరణంతో మనస్తాపంతో ఉన్న కోడూరు శెట్టి (38) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చిన్నరాముడుపాళెం శుక్రవారం జరిగింది. కావలిరూరల్ ఎస్సై వెంకటరావు సమాచారం మేరకు.. చిన్నరాముడుపాళెంకు చెందిన కోడూరు శెట్టి తమ్ముడు లక్ష్మయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడంతో అప్పటి నుంచి మనస్తాపంతో ఉన్నాడు. శుక్రవారం ఉదయం శెట్టి భార్య మంగమ్మ పాత బంగారుపాళెంలోని తన కుమార్తె ఇంటికి వెళ్లి వచ్చే సరికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధిలో రూ.44,956 నగదు రికవరీ

- సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్ణయం



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

సంగం: మండలంలో 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు ఉపాధి హామీ పథకంలో జరిగిన 950 పనులకు సంబంధించి శుక్రవారం సోషల్ ఆడిట్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రొసిడింగ్ అధికారి శ్రీహరి రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి సురేష్‌బాబు అధ్యక్షతన జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. రూ.4.12 కోట్లతో చేపట్టిన పనులకు సంబంధించి గ్రామాల వారీగా మస్టర్ రికార్డులు పరిశీలించారు. మర్రిపాడులో ఫీల్డ్ అసిస్టెంట్ అవకతవకలకు పాల్పడుతున్నారని ఆ గ్రామ సర్పంచ్ సురేష్, ఎంపీటీసీ మల్లికారున్‌రెడ్డి సోషల్ ఆడిట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మండలంలో మొత్తం 20 గ్రామాల్లో చేపట్టిన పనుల్లో అవకతవకలు జరినట్లు నిర్ధారించారు. సంబంధిత బాధ్యుల నుంచి రూ.44,956 నగదు రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్ పీ కాంతారావు, ఏపీడీ శంకర్‌నారాయణ, డీఆర్‌పీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మర్రిపాడు: మర్రిపాడు ఆటోస్టాండ్ వద్ద ఎస్‌కే ఖాజావలి జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్సై విశ్వనాథ్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఎస్సై మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. తొలి రోజున మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

మేకపాటికి వ్యతిరేకంగా నినాదాలు



పాత బస్టాండ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న జెడ్పీటీసీ బాలకృష్ణారెడ్డి అనుచరులు



సీతారామపురం బస్టాండ్ కూడలిలో మేకపాటి ఫ్లెక్సీని దహనం చేస్తున్న కార్యకర్తలు

వింజమూరు: వింజమూరు పాతబస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. చంద్రశేఖర్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అనుకూలంగా జై జగన్ జై జగన్ అంటూ నినదించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 2019లో ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఎమ్మెల్యే మేకపాటి ప్రజావ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో పార్టీని, వైఎస్సార్‌సీపీని భ్రష్టు పట్టించారన్నారు. ధనాపేక్షతో ఉదయగిరి నియోజకవర్గంలో పార్టీని నిర్వీర్యం చేశారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కూడా వెన్నుపోటు పొడిచారన్నారు. ఇప్పటికైనా అధిష్టానం ఎమ్మెల్యే మేకపాటిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్లు గువ్వల కృష్ణారెడ్డి, విజయకుమార్‌రెడ్డి, ఎంపీటీసీ ఆనంగి రమణయ్య, నాయకులు గణపం రమేష్‌రెడ్డి, పోలుబోయిన వెంకటేశ్వర్లు, డేగా రత్నం, నందిగుంట సర్పంచ్ ఖాజారెడ్డి, గుండ్లపల్లి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మేకపాటి దిష్టిబొమ్మ దహనం

సీతారామపురం: సీతారామపురం బస్టాండ్ కూడలిలో ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేశారు. జైజగన్.. జైజగన్ అంటూ నినాదాలు చేస్తూ తాము ఎప్పటికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామన్నారు. పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్ముడుపోవడం హేయం

ఉదయగిరి: ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తల్లి పాలు తాగి రొమ్ము గుద్దిన చందంగా వ్యవహరించారని ఉదయగిరి మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి దుయ్యబట్టారు. పార్టీ అధిష్టానం నిర్ణయానికి వ్యతిరేకంగా టీడీపీకి అమ్ముడుపోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు. రెండేళ్ల క్రితమే ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి నియోజకవర్గంలో చేస్తున్న అరాచకాలను, అన్యాయాలను పార్టీ నేతల నుంచి వసూలు విషయాన్ని సీఎం జగన్‌మోహన్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లానన్నారు. పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాన్ని హర్షించారు.

ఎమ్మెల్యే మేకపాటి దిష్టిబొమ్మ దహనం

కలిగిరి: ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి దిష్టిబొమ్మను మండలంలోని పరికోటలో వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు శుక్రవారం రాత్రి దహరం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పార్టీకి వెన్నుపోటు పొడిచిన ఎమ్మెల్యే మేకపాటిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడం శుభపరిణామన్నారు. బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.



పరికోటలో ఎమ్మెల్యే మేకపాటి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభిమానులు

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

- హౌసింగ్ పీడీ వెంకటదాసు



కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ వెంకటదాసు

సంగం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటదాసు సూచించారు. సంగంలోని హౌసింగ్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులు పరిశీలించి ఇళ్ల నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ ఏఈ కరిముల్లాతో చర్చించారు. ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

అంగన్‌వాడీల విధుల్లో అలక్ష్యం తగదు

సోమశిల: అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న కార్యకర్తలు అలక్ష్యం చేయకుండా చూసుకోవాలని అనంతసాగరం సీడీపీఓ పద్మావతి తెలిపారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పోషణ్ పక్వాడ్ కార్యక్రమంపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆమె వివరించారు.

వ్యాయామంతోనే ఆరోగ్యం

ఉదయగిరి: ప్రతి రోజూ వ్యాయామం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండొచ్చని సీఐ గిరిబాబు, ఎస్సై ఎస్.ప్రభాకర్ శుక్రవారం తెలిపారు. ఇటీవల పోలీస్‌శాఖలో వివిధ అనారోగ్య కారణాలు, గుండెపోటుతో పోలీసు సిబ్బంది మృతి చెందుతుండడంతో ఎస్పీ విజయారావు ఆదేశాల మేరకు అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సిబ్బంది గంటపాటు వ్యాయామం చేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు చేయాలని సూచించినట్లు తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

ఉదయగిరి: పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని మండలంలోని బిజ్జంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన శుక్రవారం పాఠశాలలో జరిగిన వార్షికోత్సవంలో మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలు దగ్గరపడుతున్న దృష్ట్యా భయాన్ని తొలగించుకొని శ్రద్ధగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రతి ఏడాది పాఠశాల పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం సాధిస్తోందన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ లక్కు రమణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరిపురం గ్రామ పంచాయితీ కార్యాలయం

టెండరు ప్రకటన తేదీ : 24.03.2023

కావలిమండలం, సిరిపురం గ్రామ పంచాయితీ నందు 2023–2024 సం॥నకు అనగా తేది 01-04-2023 నుండి 31-03-2024 వరకు ఈ క్రింది తెలిపిన కాంట్రాక్టు పోస్టులకు తేది 01-04-2023న గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద ఉదయం 10గం॥ నుండి 1-00గం॥ వరకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.

వ.నెం	వివరములు	కాలపరిమితి	ధరావత్తు
1.	P.W.S ఆపరేటర్	01-04-2023 నుండి 31.03.2024 వరకు	రూ.1000/-

సం/-. పంచాయితీ కార్యదర్శి, సిరిపురం గ్రామపంచాయితీ, కావలి మండలం.

చలంచర్ల గ్రామ పంచాయితీ కార్యాలయం

టెండరు ప్రకటన తేదీ : 24.03.2023

కావలిమండలం, చలంచర్ల గ్రామ పంచాయితీ నందు 2023–2024 సం॥నకు అనగా తేది 01-04-2023 నుండి 31-03-2024 వరకు ఈ క్రింది తెలిపిన కాంట్రాక్టు పోస్టులకు తేది 01-04-2023న గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద ఉదయం 10గం॥ నుండి 1-00గం॥ వరకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.

వ.నెం	సేవల వివరములు – పోస్టుల సంఖ్య	కాలపరిమితి	ధరావత్తు
1.	పారిశుధ్యము, మంచినీటి సరఫరా మరియు వీధి విద్యుత్ దీపముల నిర్వహణకు (5) ఐదు మందిని నియమించుటకు	01-04-2023 నుండి 31.03.2024 వరకు	రూ.1000/-

సం/-. పంచాయితీ కార్యదర్శి, చలంచర్ల గ్రామపంచాయితీ, కావలి మండలం.